సాక్షి
కామారెడ్డి
శనివారం । 12 । జూలై । 2025



అత్యవసర సేవలు.. అందని ద్రాక్షే
దోమకొండ క్లస్టర్ ఆస్పత్రిలో అత్యవసర సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉంది.
- 8లో ▸



నాయకులుగా తీర్చిదిద్దేందుకు..
భవిష్యత్ నేతలుగా తీర్చిదిద్దడానికి నస్రుల్లాబాద్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /21.6

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జనాభా పెరుగుదలను నియంత్రించాలి

- డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



కామారెడ్డి టౌన్: జనాభా పెరుగుదలను నియంత్రించాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కాలనీ పీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జనాభా వల్ల కలిగే సమస్యలపై, గర్భధారణ సమయ నిర్ణయం, సురక్షిత ప్రసవం గురించి చేపట్టవలసిన చర్యలు, కుటుంబ నియంత్రణ శాశ్వత, తాత్కాలిక పద్ధతుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనురాధ, మెడికల్ ఆఫీసర్ సాయి ఈశ్వరి, చలపతి, రమణ, మమత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు కాయకల్ప అవార్డులు

కామారెడ్డి టౌన్ : రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తాజాగా ప్రభుత్వ ఆస్పత్రులకు కాయకల్ప అవార్డులను ప్రకటించింది. జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పతులకు అవార్డులు వచ్చాయి. ఏరియా ఆస్పత్రి విభాగంలో బాన్సువాడ ఆస్పత్రికి రాష్ట్ర స్థాయిలో 84.61 మార్కులతో 19వ స్థానంలో నిలిచింది. అవార్డుతో పాటు రూ.లక్ష నగదు దక్కించుకుంది. పీహెచ్‌సీలలో రాజీవ్‌నగర్ కాలనీ యూపీహెచ్‌సీ ఉత్తమ సేవా అవార్డుతో పాటు రూ.13,35,000 దక్కించుకుంది. ఉత్తమ పీహెచ్‌సీగా లింగంపేట రూ.2 లక్షల నగదు, అలాగే మత్మల్, హన్మాజీపేట్, బీబీపేట, మాచారెడ్డి, దోంగ్లీ, పుల్కల్ పీహెచ్‌సీలు ప్రంశసా అవార్డులను అందుకోగా ఒక్కో పీహెచ్‌సీకి రూ. 50 వేల చొప్పున నగదు అవార్డును ప్రకటించారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మిలు అవార్డు అందుకున్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

ప్రధానమంత్రి జాతీయ శిక్షణ మేళా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రావణి ఐటీఐలో ఈ నెల 14న ప్రధాన మంత్రి జాతీయ శిక్షణ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ ప్రతులతో జిల్లా కేంద్రంలోని కళాశాలలో హాజరుకావాలని వెల్లడించారు. ప్రముఖ కంపెనీలు ఉద్యోగ అవకాశాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేనేమి చేశాను పాపం.. నాకేమిటీ శిక్ష?

- పుట్టిన ఆడ బిడ్డను వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- బాల సంరక్షణ కేంద్రానికి తరలింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

బిచ్కుంద(జుక్కల్) : భూమి మీద పడి ఎన్నో గంటలు గడవనే లేదు. ఒళ్లంతా పురిటి రక్తపు మరకలు..బొడ్డు తాడు సరిగ్గా కోయనేలేదు. అమ్మ ఒడిలో ఉండాల్సిన శిశువు, ఎక్కడో బ్రిడ్జి వద్ద పడేసిన అమానుష ఘటన బిచ్కుంద పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. నిర్మానుష్య ప్రదేశంలో వదిలేసిన ఆ శిశువును చూసి స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. వివరాలు.. బిచ్కుంద- బాన్సువాడ రోడ్డులో శుక్రవారం ఉదయం పెద్దదేవాడ వాగు బ్రిడ్జి వద్ద అప్పుడే జన్మించిన నవజాత శిశువును ఓ గుడ్డలో వదిలేసి వెళ్లిపోయారు. అటు నుంచి వెళ్తున్న వాహనదారులు శిశువు ఏడుపును గమనించి పెద్దదేవాడ గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మోహన్‌రెడ్డి చేరుకొని శిశువును పుల్కల్ పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం అందించడానికి బాన్సువా డ ఏరి యా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం ఎస్సై, ఐసీడీఎస్ అధికారులను పిలిపించి కామారెడ్డి బాల రక్షా భవన్ కేంద్రానికి తరలించారు. చికిత్స తర్వాత శిశువు ఆరోగ్యగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

మైదానాన్ని తలపిస్తున్న నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి చెరువు



వరుణుడి దోబూచులాట

- ఒర్రెలు, వాగులు పారలేదు
- చెరువుల్లో చుక్క నీరు చేరలేదు
- భూగర్భ జలం వృద్ధి చెందలేదు
- అయోమయంలో అన్నదాత

ఈ ఏడాది ఎప్పుడూ లేనిది మే నెలలోనే భారీ వర్షం కురియడంతో రైతులు సంతోషించారు. నీటికి కొదవ ఉండదని భావించి అంతా పంటలు వేసుకున్నారు. తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు సాగుపై ఆందోళన చెందుతున్నారు. చెరువులు, కుంటల్లో కూడా నీరు అడుగంటిపోయి మైదానాలను తలపిస్తున్నాయి. కమ్ముకువస్తున్న మేఘాలను చూసి వరుణుడు కరుణిస్తాడని ఆశ పడడమే తప్ప ఒకటైనా భారీ వర్షం కురవలేదు. దీంతో వానాకాలం సాగుపై నీలినీడలు అలుముకున్నాయి. అదను దాటిపోతుందేమోనని రైతులు భయపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కార్తెలు కరిగిపోతున్నా జల్లులే తప్ప జడివానలు కురవలేదు. రోహిణీ కార్తెలోనే తొలకరి జల్లులు కురవడంతో రైతులు ఎంతో సంతోషించారు. ముందస్తు వర్షాలతో కాలం అనుకూలిస్తుందని ఆశించారు. మగశిర, ఆరుద్ర కార్తెలు అనుకూలించలేదు. ఇప్పటి వరకు ఏ ఒక్క చెరువులోకి చుక్క నీరు వచ్చి చేరలేదు. కనీసం ఒర్రెలలో నీరు నిలిచేంత వాన కూడా కురవలేదు. రికార్డుల ప్రకారం జిల్లాలో ఈ రోజు వరకు సాధారణ వర్షపాతం 219.7 మిల్లీ మీటర్లు కాగా 216.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే జిల్లాలోని పెద్దకొడప్‌గల్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. 14 మండలాల్లో సాధారణం, ఐదు మండలాల్లో కొంచెం ఎక్కువ కురిసింది. అయితే ఎక్కడ కూడా వాగులు పొంగి ప్రవహించేంతగా కురవలేదు. జిల్లాలో చిన్నాపెద్ద అన్నీ కలిపి 2,056 చెరువులు, కుంటలున్నాయి. చెరువుల కింద 96 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నెలన్నర కాలంగా భారీ వర్షాలు కురవకపోవడంతో కుంటలు, చెరువులన్నీ చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి.

5.11 లక్షల ఎకరాల్లో సాగు అంచనా..

వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 5.11 లక్షల ఎకరాలలో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాగా ఇప్పటి వరకు 2.47 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. రెండున్నర లక్షల ఎకరాల్లో వరి సాగవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు వరి 67 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. వర్షాలు లేకపోవడం వల్లే వరి నాట్లు ఆలస్యమవుతున్నాయి. సోయా పంట 77,124 ఎకరాల్లో, మక్క పంట 43,651 ఎకరాలు, జొన్న 23,214 ఎకరాలు, పత్తి 30,958 ఎకరాల్లో సాగయ్యాయి.

కుదురుకోని బోర్లు..

వానాకాలం సీజన్లో భారీ వర్షాలు లేకపోవడంతో బోర్లు ఇప్పటికీ కుదురుకోలేదు. చాలా చోట్ల రైతులు నారుమడులు పోసినా నాట్లు వేయడానికి సరిపడా నీరు అందడం లేదని చెబుతున్నారు. చాలా చోట్ల వేసవిలో ఎత్తిపోయిన బోర్లలో ఇప్పటికీ ఊటలు పెరగలేదు. నిజాంసాగర్ ఆయకట్టు కింద నాట్లు వేశారు. పోచారం ప్రాజెక్ట్‌లోకి నీరు వచ్చి చేరితేగానీ నాట్లు వేసే పరిస్థితి లేదు.

వరుణుడు కరుణిస్తేనే..

భారీ వర్షాలు లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ముఖ్యంగా వరి సాగు చేయాలంటే నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్తెలోనైనా వరుణుడు కరుణిస్తే సాగు ముందుకు నడుస్తుందని అంటున్నారు. ఆరుతడి పంటలకు కొంత అనుకూలంగా ఉంది. వరి నాట్లు వేయడానికి అదను దాటుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సన్నం సరే.. దొడ్డు మాటేమిటి?

- రేషన్ దుకాణాల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యం నిల్వలు
- త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్న రేషన్ డీలర్లు

ఎల్లారెడ్డి: కామారెడ్డి జిల్లాలో 3 నెలల సన్నబియ్యం పంపిణీ విజయవంతంగా పూర్తయింది. కానీ రేషన్ షాపుల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యాన్ని ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారన్న ప్రశ్నకు సివిల్ సప్లయ్ అధికారుల వద్దే సమాధానం లేదు. జూన్ నెల ఆసాంతం జరిగిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జిల్లాలో 93 శాతం పూర్తయింది. జిల్లాలోని 578 రేషన్ దుకాణాలకు 17,711.470 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం మూడు నెలల కోటా కింద విడుదల చేయగా వీటిలో 16,471.667 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేశారు. అయితే రేషన్ దుకాణాలలో పంపిణీ జరగకుండా మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యం పంపిణీ కంటే ముందే స్వాధీనం చేసుకుంటామన్న సివిల్ సప్లయ్ శాఖ ఇప్పటి వరకు బియ్యం వాపస్ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రేషన్ దుకాణాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాలు, గోదాముల్లో కలిపి దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారుల అంచనా. దీని విలువ దాదాపు రూ. 400 కోట్లపై చిలుకు ఉంటుందని అధికారులే అంటున్నారు. మార్చి నుంచి ఈ నిల్వలు అలాగే ముక్కి పోతున్నాయి.

ఎక్కడ నిల్వ చేసుకోవాలి..?

జూన్ 1కి ముందున్న దొడ్డు బియ్యం నిల్వలు దుకాణాల్లో అలాగే ఉండటంతో మూడు నెలల సన్న బియ్యం కోటాను ఎక్కడ పెట్టుకోవాలో తెలియక రేషన్ డీలర్లు ఇబ్బంది పడ్డారు. మార్చి నుంచి రేషన్ దుకాణాలు, గోదాముల్లో ఉన్న బియ్యం ప్రస్తుతం గడ్డలు కట్టి పురుగులు పట్టి పనికి రాకుండా తయారైంది. ఈ చెడిపోతున్న బియ్యం కారణంగా సన్న బియ్యానికి కూడా పురుగులు పడుతున్నాయి. గతంలో ఇలాగే కందిపప్పును పంపిణీ చేయగా మిగిలిపోయిన పప్పు సివిల్ సప్లయ్ అధికారులు వెనక్కి తీసుకుంటామని తీవ్ర జాప్యం చేశారు. దుకాణాల్లో మిగిలిపోయిన పప్పు పురుగులు పట్టి దుర్వాసన వస్తుండటంతో దుకాణదారులు బయట పారబోయాల్సి వచ్చింది. చెడిపోయిన పప్పును పారబోసిన కొద్ది రోజులకు అధికారులు మిగిలిపోయిన పప్పు నిల్వలను



రేషన్ దుకాణాల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యం నిల్వలు

వెనక్కి తీసుకోవడానికి రావడంతో.. పారబోసిన పప్పును మళ్లీ తేలాక మార్కెట్ నుంచి కందిపప్పును కొని అధికారులకు రేషన్ దుకాణ నిర్వాహకులు అప్పగించారు. ఇప్పుడు కూడా గడ్డలు కట్టి పురుగులు పట్టిన బియ్యాన్ని ఏమి చేయాలో తెలియక మదనపడుతున్నారు.

దొడ్డు బియ్యం ఎక్కడ ఉంచాలి?

రేషన్ దుకాణాల్లో గడ్డలు కట్టి, పురుగులు పట్టి చెడిపోతున్న దొడ్డు బియ్యం నిల్వలను ఎక్కడ ఉంచాలో అర్థం కావడం లేదు. గతంలో ఇలాగే చెడిపోయిన కందిపప్పును బయట పారబోస్తే అధికారులు మిగిలిపోయిన పప్పును తమకు వెనక్కి ఇవ్వాలని ఆదేశించారు. సొంత ఖర్చుతో కంది పప్పు కొని అధికారులకు అప్పగించాం. ప్రభుత్వం దొడ్డు బియ్యం నిల్వల స్వాధీనం విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలి.

– నాగం సురేందర్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు

ఆదేశాలు రావాల్సి ఉంది ..

రేషన్ దుకాణాలు, గోదాముల్లో మార్చి నెల నుంచి నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని స్వాధీనం చేసుకునే విషయంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే దొడ్డు బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటాం.

– మల్లికార్జున్, జిల్లా పౌర సరఫరాల అధికారి

పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లాకు 11 పతకాలు

- ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: కరీంనగర్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన 2వ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లాకు 11 పతకాలు దక్కినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లలో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పతకాలు సాధించిన వారికి రివార్డులను అందజేసి అభినందించారు. ఏఆర్ సీఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన గాంధారి ఎస్సై..

గాంధారి ఎస్సైగా పని చేస్తున్న ఆంజనేయులు పతకాల వేటలో ముందున్నారు. కేసుల విచారణలో శాస్త్రీయ వినియోగానికి(లిఫ్టింగ్, ప్యాకింగ్, ఫింగర్ ప్రింట్స్ ఫార్వర్డ్, నేర స్థల ఫొటోగ్రఫీ) సంబంధించిన అంశాల్లో 3 బంగారు, 2 వెండి పతకాలు సాధించారు. మద్నూర్ ఎస్సై విజయ్ ఫోరెన్సిక్, ఫొటోగ్రఫీ, ఫింగర్ ప్రింట్ సైన్స్‌లలో 2 వెండి పతకాలు సాధించారు. బిచ్కుంద రైటర్ లక్ష్మీనారాయణకు ఉత్తమ దర్యాప్తు(రైటర్) పతకం దక్కింది. కంప్యూటర్‌పై అవగాహన, విధ్వంసకాల విచ్ఛిన్నంపై తనిఖీలు తదితర అంశాల్లో రాజంపేట కానిస్టేబుల్ చిరంజీవికి కాంస్యం, ఏఆర్ కానిస్టేబుళ్లు రామచంద్రం, ఎల్లారెడ్డిలకు వెండి పతకాలు లభించాయి.



పతకాలు సాధించిన అధికారులతో ఎస్పీ రాజేష్

మీ-సేవ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారిగా సత్యనారాయణ

కామారెడ్డి టౌన్: తెలంగాణ మీ-సేవ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా జిల్లా కేంద్రానికి చెందిన చిలుక సత్యనారాయణ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎన్నికలు జరిగాయి. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా జిల్లా కేంద్రానికి చెందిన రాపెల్లి నవ్య ఎన్నికయ్యారు. వీరికి రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.



నియామకపత్రం అందుకుంటున్న సత్యనారాయణ

ప్రకృతితోనే మానవ మనుగడ

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ప్రకృతితోనే మానవ మనుడగ సాధ్యమని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి మొక్కలు నాటారు. అంతకు ముందు ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 2015 కంటే ముందు రాష్ట్రంలో 21 శాతం చెట్లు ఉంటే తర్వాత కాలంలో 26 శాతానికి చేరిందని, భవిష్యత్‌లో 33 శాతం వరకు చెట్లు ఉంటేనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించే బాధ్యత అంతే ముఖ్యమన్నారు. పుట్టినప్పటి నుంచి మరణించే వరకు కట్టే అవసరం ఉంటుందని అన్నారు. తెలంగాణ భౌగోళిక విస్తీర్ణం 2 కోట్ల 75 లక్షల ఎకరాలు ఉందని, సరైన సమయంలో వర్షాలు పడాలంటే వాతావరణంలో సమతుల్యం ఉండాలని, అందుకనే రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం నిర్వహిస్తోందని అన్నారు. ఈ ఏడాది 18.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేయాలన్నారు. విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయులు, అధికారులు కూడా మొక్కలు నాటాలని సూచించారు. జిల్లా అటవీశాఖ అధికారిణి సునీత, ఎఫ్‌ఆర్‌వో అబీబ్, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సలాం, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, అధ్యాపకులు, నాయకులున్నారు.



బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న పోచారం, పక్కన సబ్ కలెక్టర్ కిరణ్మయి

విద్యార్థులతో కలిసి ప్రార్థన

కళాశాలలో మొక్కలు నాటేందుకు వచ్చిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తాను ఇదే కళాశాలలో చదువుకున్నానని, తరగతితో ఫస్ట్ వచ్చేవాడినని గుర్తు చేశారు. కళాశాలకు వస్తున్నానని తాను పంచె కట్టుకుని రాకుండా ప్యాంటు చొక్కా వేసుకుని వచ్చానని సరదాగా వ్యాఖ్యానించారు.



విద్యార్థులతో పాటు ప్రార్థన చేస్తూ..

ఏరియా ఆస్పత్రి పనుల పరిశీలన

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని కొత్తగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణ పనులను శుక్రవారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పాత ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి రూ.37.50 కోట్లతో నూతన ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నారు. పనులు నాణ్యతగా చేయించాలని అధికారులను ఆదేశించారు. నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, లింగం, హకీమ్, సాయిలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు సర్వం సిద్ధం

- గత 51 ఏళ్లుగా నిరాటంకంగా బోనాల ఉత్సవం
- రేపే దోమకొండలో మహంకాళి బోనాల పండుగ
- 18 చేతులతో ప్రతి చేతిలో ఒక ఆయుధంతో అమ్మవారు

దోమకొండ : దోమకొండలోని దేవి ఆలయాన్ని మహంకాళి, చాముండేశ్వరి ఆలయంగా పిలుస్తుంటారు. కాళిక, దుర్గ, చాముండీ మాతల కలయికగా భక్తులకు దర్శనమిచ్చే చాముండేశ్వరి అమ్మవారు కార్యాలను విజయవంతం చేస్తుందని ప్రతీతి.

ఆలయ చారిత్రక నేపథ్యం..

దోమకొండ సంస్థానానికి చెందిన కామినేని వంశీయులు ఈ ఆలయాన్ని నిర్మించారు. దాదాపు 1943–1946 మధ్య కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్లోని జైపూర్ నుంచి అమ్మవారి పాలరాతి విగ్రహాన్ని తెప్పించి 1972 అక్టోబర్ 28న ప్రతిష్ఠాపన చేశారు. ఇక్కడి అమ్మవారు రాక్షసులను సంహరిస్తుందనే రూపంలో ఉండి భక్తులకు దర్శనమిస్తుంది. అమ్మవారి 18 చేతుల్లో ప్రతి చేతిలో ఒక ఆయుధం కలిగి ఉండటం విశేషం.



దోమకొండలోని చాముండేశ్వరి ఆలయం



గతేడాది బోనాలు సమర్పిస్తున్న మహిళలు (ఫైల్)

కోర్కెలు తీర్చే చాముండేశ్వరి అమ్మవారిగా..

బోనాల పండుగ 51 ఏళ్లుగా నిరాంటంకంగా కొనసాగుతోంది. ఏటా ఆషాఢంలో పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం బోనాలు తీస్తారు. ఆదివారం (13న) ఉదయం భవిష్యవాణి, ఘటం ఊరేగింపు, పోతరాజులు జీవాలను గావు పట్టుట, మధ్యాహ్నం 12 గంటల నుంచి బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి తీసుకొచ్చి మొక్కులు సమర్పిస్తారు. భక్తులు సమర్పించిన 12 కిలోల వెండితో ఇటీవల అమ్మవారికి మకరతోరణం చేయించారు. మండల కేంద్రంలో దాదాపు 4,250 కుటుంబాలు నివసిస్తుండగా ప్రతి ఇంటి నుంచి బోనం సమర్పిస్తారు. బోనాల పండుగ రోజు బంధువులు, స్నేహితులను పిలుచుకుంటారు. తెలంగాణలోనే రెండో మహంకాళి అమ్మవారి ఆలయంగా ఇక్కడి దేవాలయం పేరుగాంచింది. బోనాల అనంతరం ఆశ్వయుజ మాసం శుక్ల పక్షంలో దసరా దేవి నవ రాత్రి ఉత్సవాలను కూడా ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తారు.

ప్రతి శుక్రవారం భక్తులు భారీగా వస్తారు

51 ఏళ్లుగా అమ్మవారికి బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి ప్రతి శుక్రవారం పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తారు. మెదక్, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వస్తుంటారు.

– భావి శరత్‌చంద్రశర్మ, ఆలయ అర్చకులు, దోమకొండ



ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఘటం ఊరేగింపు నుంచి బోనాలు పూర్తి అయ్యేవరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వేలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బారికేడ్లు కూడా ఏర్పాటు చేశాం. – సిద్దారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, దోమకొండ



బీబీపేటలో బోనాలకు ఏర్పాట్లు

బీబీపేట : మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారి బోనాలు ఆదివారం జరగనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే గుంతలు ఉన్న ప్రాంతంలో మొరం పోయించడంతో పాటు విద్యుత్ దీపాలను అమర్చారు.



బీబీపేట మహంకాళి ఆలయం వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

విద్యారంగంలో పెరిక కులస్తులు ముందుండాలి



దోమకొండ: విద్యారంగంలో పెరిక కులస్తులు ముందుండాలని జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు కుంచాల శేఖర్ అన్నారు. శుక్రవారం దోమకొండ పెరిక సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది పదవ తరగతి, ఇంటర్, ఎంబీబీఎస్, డిగ్రీ లలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారికి ప్రోత్సాహ బహుమతుల అందించారు. వీటితోపాటు సంఘ సభ్యులు రాజకీయాల్లో సత్తా చాటాలని సూచించారు. ఉన్నత మార్కులు సాధించిన 11 మందికి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో దోమకొండ సదర సంఘం అధ్యక్షుడు మర్రి శేఖర్, ప్రధాన కార్యదర్శి బోడ కుంటి తిరుపతి, పాండీ అధ్యక్షులు అంకత్ నరసింహులు, కుంచాల సత్యం, ఆశంశెట్టి పోచయ్య, సంఘం ప్రతినిధులు అల్లే రవి, శంకర్, నల్లపు శ్రీనివాస్, పిన్నం రామచంద్రం, బుర్రి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై హర్షం



బిచ్కుంద(జుక్కల్): స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై బిచ్కుందలో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు. జుక్కల్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఆస్పత్రి, ఇరిగేషన్, రోడ్లు ఇతర పనులకు 18 నెలల్లో రూ. 900 కోట్లు నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో చేసిన కులగణన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కేంద్ర కూడా హర్షించిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్, నాగ్‌నాథ్, నాగ్‌నాథ్ పటేల్, తుకారాం, సాయిలు, నాగ్‌రాజ్, అశోక్, సాహిల్ షెట్కార్, దశరథ్, స్వామి పాల్గొన్నారు.

అత్యవసర సేవలు.. అందని ద్రాక్షే

- దోమకొండ క్లస్టర్ ఆస్పత్రిలో 24 గంటల వైద్య సేవలు కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



దోమకొండలో 30 పడకల క్లస్టర్ ఆస్పత్రి

దోమకొండ: దోమకొండలోని క్లస్టర్ ఆస్పత్రిలో 24 గంటల వైద్య సేవలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు సైతం రాత్రివేళల్లో నిర్వహించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం వైద్యులు రావడం కూడా మానేశారు. రాత్రిళ్లు ఆరోగ్య సమస్య తలెత్తితే, అత్యవసర వైద్య చికిత్స కోసం కామారెడ్డికి వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఇక్కడ కు.ని చికిత్సలు నిర్వహించగా జిల్లాలోనే అత్యధికంగా ఇక్కడే శస్త్రచికిత్సలు జరిగి ముందంజలో ఉండేది. ప్రస్తుతం సాధారణ వైద్య సేవలు మాత్రమే అందిస్తున్నారు.

2006లో 30 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు...

దోమకొండలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 2006లో రూ.1.96 కోట్లతో 30 పడకల ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు నాలుగు ఉండగా..ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 11 మంది అసిస్టెంట్ సివిల్ సర్జన్లకు గాను ఇద్దరు రెగ్యులర్‌గా ఉండగా, ఆరుగురు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు హెడ్ నర్సులు అవసరం ఉండగా ఒక్కరే విధుల్లో ఉన్నారు. ఆస్పత్రిలో 10 మంది స్టాఫ్ నర్స్ పోస్టులుండగా, 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. డార్క్‌రూం అసిస్టెంట్ పోస్టులు రెండు ఉండగా, ఒకరు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ముగ్గురు ఎంఎన్‌వో పోస్టులు ఉండగా మూడు ఖాళీగానే ఉన్నాయి. పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆస్పత్రిలో సరైన సేవలు అందడం లేదు. దీంతో అత్యవసర కేసులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి వస్తోంది.

ప్రస్తుతం 50 పడకల ఆస్పత్రిగా మార్చుతూ ఉత్తర్వులు..

దోమకొండలోని క్లస్టర్ ఆస్పత్రి స్థాయిని 50 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 50 పడకల ఆస్పత్రిగా మారితేనైనా వైద్యులు వైద్య సేవలు 24 గంటల పాటు అందుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి 24 గంటల పాటు వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను భర్తీ చేయాలి



దోమకొండలోని 30 పడకల క్లస్టర్ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విషయంలో వైద్యుల సంఖ్య, సిబ్బందిని పెంచి 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి షబ్బీర్‌అలీకి, వైద్య విధాన కమిషనర్‌కు వినతిపత్రం అందించాము. వారు దానికి సానుకూలంగా స్పందించారు.

– తిర్మల్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ, దోమకొండ

చర్యలు తీసుకుంటాం



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ఉన్న సిబ్బందితో పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులతో నెట్టుకొస్తున్నాం. 24 గంటల పాటు వైద్య సేవలు అందాలి. ప్రతిరోజూ మధ్యాహ్నం తర్వాత రాత్రిళ్లు కూడా అందుబాటులో ఉండేలా డ్యూటీ డాక్టర్‌కు విధులు వేస్తున్నాను. 24 గంటల పాటు వైద్య సేవలు అందేలా చూస్తాను.

– వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, దోమకొండ

మాంసం దుకాణాలు తొలగించాలని ఆందోళన



బిచ్కుంద మున్సిపల్ ఆఫీస్ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని హైస్కూల్, ప్రైమరీ పాఠశాల ప్రహరీ గేటు వద్ద ఉన్న చికెన్, మటన్ మాంసం దుకాణాలను తొలగించాలని కోరుతూ శుక్రవారం విద్యార్థులు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మాంసం దుకాణాల కారణంగా కుక్కలు విద్యార్థులపై దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కుక్కల భయంతో విద్యార్థులు పాఠశాలకు రాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. చీకటిపడితే పాఠశాల ఆవరణలో మద్యం సేవించి గాజు బాటిళ్లు పగలగొడుతున్నారు. కాళ్లకు గుచ్చుకొని గాయాలు అవుతున్నాయని వాపోయారు. వారం రోజుల్లో మాంసం దుకాణాలు తొలగిస్తామని కమిషనర్ ఖయ్యుం విద్యార్థులకు హామీ ఇచ్చారు. మాంసం దుకాణాదారులకు నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మాంసం కోసం కేటాయించిన మార్కెట్‌లో దుకాణాలు పెట్టుకోవాలని అక్కడ మున్సిపల్ నుంచి నీరు, మురికి కాలువలు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని దుకాణదారులకు కమిషనర్ సూచించారు.

కుటుంబ ప్రయోజన పథకాన్ని వినియోగించుకోవాలి



బాన్సువాడ రూరల్/భిక్కనూరు : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సాయం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాన్సువాడ సబ్ కలెక్టర డాక్టర్ కిరణ్మయి అన్నారు. జాతీయ కుటుంబ భద్రత పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం భిక్కనూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.కుటుంబ పెద్ద మృతి చెందినట్లయితే ప్రభుత్వం రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. పథకానికి అర్హత పొందాలంటే మృతిని వయస్సు 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండి 12 ఏప్రిల్ 2017 తర్వాత మృతి చెంది ఉండాలన్నారు.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన బుగ్గ రామలింగేశ్వరుడు



మద్దికుంటలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయం



ఆలయంలోని శివలింగం

మీకు తెలుసా?

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న శివలింగాన్ని స్వయంగా శ్రీరాముడే ప్రతిష్ఠించి, కొలిచినట్లుగా చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

- శ్రీరాములు వనవాసంలో ఉండగా లింగంను ప్రతిష్ఠించి, పూజలు చేశాడు. నాటి శివలింగమే నేడు బుగ్గ రామలింగేశ్వరుడిగా పూజలు అందుకుంటున్నాడు.
- మాఘ అమావాస్య రోజున ఈ ఆలయం వద్ద పుణ్యస్నానాలను ఆచరించడానికి భక్తులు భారీగా తరలివస్తారు.
- మహా శివరాత్రి పర్వదినం నాడు బుగ్గ రామలింగేశ్వరుడిని లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. శివపార్వతుల కల్యాణోత్సవం, రథోత్సవం మర్నాడు అగ్నిగుండాలు నిర్వహిస్తారు.
- బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో 2005 నుంచి నేటి వరకు నిత్యాన్నదానం నిరంతరంగా కొనసాగుతుంది.
- గ్రామస్తులందరు కలిసి స్వయంగా రెండు నెలల రేషన్ బియ్యాన్ని అన్నదానానికి విరాళంగా అందజేస్తారు.
- బుగ్గ రామలింగేశ్వర ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే వృద్ధాశ్రమంలో వందమంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.
- 70 ఆవులను ఆలయం ఆధ్వర్యంలో పోషిస్తున్నారు.
- కామారెడ్డి నుంచి నేరుగా బుగ్గ రామలింగేశ్వరుడి ఆలయానికి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

– రామారెడ్డి

రాజకీయ కుట్రతోనే నా అరెస్టు

- పోలీసుల తీరుపై డీఐజీకి ఫిర్యాదు చేస్తా
- పేలుడు పదార్థాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: పేలుడు పదార్థాల కేసు వ్యవహారంలో రాజకీయ కుట్రలో భాగంగానే తనను అరెస్టు చేయించారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి కీలక వాఖ్యలు చేశారు. గురువారం బెయిల్‌పై వచ్చిన తర్వాత శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక ఓ పెద్దమనిషి హస్తంతో అరెస్టు జరిగిందని ఆరోపించారు. ఈనెల 3న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ లభ్యమైన లింగాపూర్ శివారులోని వెంచర్‌లో తనకు గజం స్థలం కూడా లేదన్నారు. పేలుడు పదార్థాలకు తనకు సంబంధం లేదన్నారు. ఈ కేసులో విచారణకు పిలిచిన డీఎస్పీ, సీఐకి ఆ వెంచర్‌కు సంబంధించి 1800 ఎకరాల భూమి పత్రాలను, ప్లాట్ల వివరాలను ఇచ్చానని తెలిపారు. ఈనెల 5వ తేదీన రాత్రి రూరల్ సీఐ వచ్చి ఎస్పీతో మాట్లాడుతారట వెళ్దామని చెప్పి ఓ ప్రైవేట్ వాహనంలో ఎస్పీ కార్యాలయం కాకుండా నేరుగా జాతీయ రహదారికి మళ్లించి బాన్సువాడకు అర్ధరాత్రి తీసుకెళ్లి ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించారని తెలిపారు. అక్కడి నుంచి తెల్లవారుజామున నిజామాబాద్ జైలుకు తరలించారని వివరించారు. పోలీసుల వద్దకు తానే స్వయంగా వెళ్తే ఎఫ్ఐఆర్‌లో మాత్రం తప్పించుకుని తిరుగుతున్నానని, అశోక్‌నగర్‌కాలనీ వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టుకున్నారని పొందుపర్చడం సరికాదన్నారు.అరెస్టులో పోలీసుల తీరుపై డీఐజీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారం రాజకీయ కుట్రతోనే జరిగిందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తనపై ఓ మాజీ కౌన్సిలర్ తప్పుడు ప్రచారం చేసాడని తెలిపారు.తనపై కుట్ర చేసిన ప్రతి ఒక్కరి బండారం సమయం వచ్చినప్పుడు బయటపెడుతానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవి, సలీం, పంపరి శ్రీనివాస్, సాయిబాబా, చాట్ల వంశీ తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు రిజర్వేషన్ల కోసం కృషి

- యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి



బాన్సువాడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ సభ్యులకు 25 శాతం సీట్లు కేటాయించే విధంగా కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీనివాస గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపు రాజకీయాలు పక్కన బెట్టి అందరూ కలిసిమెలిసి పని చేయాలన్నారు.

మెజారిటీ స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలి : పోచారం భాస్కర్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి అమృత, యువజన నాయకులు కాసుల రోహిత్, పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, మన్సూర్, శ్రీనివాస్, సర్దార్, దుర్గం శ్యామం, అజయ్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి సీఐగా బాధ్యతలు స్వీకరించిన రాజారెడ్డి



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి సీఐగా రాజారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ సీసీఎస్ లో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఎల్లారెడ్డికి వచ్చారు. గతంలో సీఐగా విధులు నిర్వహించిన రవీందర్ నాయక్ ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు.

పోలీస్ కావడమే లక్ష్యం

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న కార్తికేయ ఆశయం
- రామారెడ్డి భవిత కేంద్రంలో ఘనంగా జన్మదిన వేడుక



మాస్టర్ కార్తికేయకు కేకును తినిపిస్తున్న ఎస్సై లావణ్య

రామారెడ్డి: తన చిరకాల కోరిక పోలీస్ కావడమేనని 'మస్క్యులర్ డిస్ట్రోఫీ' అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న కార్తికేయ అనే బాలుడు తెలిపాడు. రామారెడ్డిలోని భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపులో కార్తికేయ జన్మదిన వేడుకను కేంద్రం సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై లావణ్య ముఖ్య అతిథిగా హాజరుకాగా, బాలుడికి కేక్ తినిపించి, ధైర్యం కల్పించారు. అనంతరం తన జన్మదినం వేళ కార్తికేయ చక్కటి పాటతో అందరిని ఆశ్చర్యపరిచాడు. ఇసన్నపల్లి గ్రామానికి చెందిన మాస్టర్ కార్తికేయకు మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే వ్యాధి సోకగా తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి భవిత కేంద్రంలో విద్యనభ్యసిస్తున్నాడు. ఈ వ్యాధి అరుదుగా వస్తుందని, ఆరేళ్లు నిండిన తర్వాత వ్యాధి లక్షణాలు బయటపడి కండరాలు పట్టివేసి అనేక రకాలుగా ఇబ్బందులు కల్గిస్తాయని, అయినా కార్తికేయ ధైర్యంగా భవిత సెంటర్‌లో చదువుతూ పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతున్నాడని డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, సురేష్, గోపాల్, మండల సీఆర్పీలు మహమూద్, యుగంధర్, సురేఖ, వెంకటస్వామి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హైవేపై మరో దారి దోపిడీ

కామారెడ్డి క్రైం: పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కామారెడ్డి వెంబడి ఉన్న జాతీయ రహదారిపై దారి దోపిడీ ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ వద్దనున్న పెట్రోల్ పంపు సమీపంలో శుక్రవారం ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. వివరాలు ఇలా... సెల్‌ఫోన్ బాక్సుల లోడ్‌తో ఓ ట్రక్కు హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా వేకువజామున ఓ దాబా వద్ద విశ్రాంతి కోసం ఆగింది. గుర్తు తెలియని దుండగులు దాదాపు 5 గంటల ప్రాంతంలో ట్రక్కు తలుపులు తెరిచి రెండు బాక్సులను చోరీ చేశారు. వాటిలో సుమారు రూ.10 లక్షల విలువైన సెల్‌ఫోన్‌లు ఉన్నట్లు తెలిసింది. డ్రైవర్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దేవునిపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు. నెల రోజుల క్రితమే రూరల్ పోలీసులు ఇలాంటి దారి దోపిడీలకు పాల్పడుతున్న పార్థి గ్యాంగ్‌ను పట్టుకుని జైలుకు పంపారు. మరో నలుగురు గ్యాంగ్ సభ్యులపై పీడీ యాక్టు నమోదు చేశారు.

ప్రజల సమస్యలపై జాప్యం చేయొద్దు

- ఎస్పీ రాజేశ్ చంద్ర

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో జరిగిన ప్రమాదాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల విషయంలో వస్తున్న బాధితులకు తగిన న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని సూచించారు. పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయాల ఆవరణలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలను సందర్శిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సంతోష్ కుమార్, ఎస్ ఐ పుష్పరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

డెయిరీ రంగంలో అనేక అవకాశాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లు

- వైస్ చాన్స్‌లర్ జ్ఞానప్రకాష్
- కామారెడ్డి డెయిరీ కళాశాల 'ఘృత–2025' వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: డెయిరీ రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని పీవీ నర్సింహరావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎం.జ్ఞానప్రకాష్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి డెయిరీ కళాశాల 'ఘృత–2025' వార్షికోత్సవం స్థానిక కళాభారతిలో నిర్వహించగా ప్రిన్సిపాల్ సురేష్ రాథోడ్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులుగా హాజరైన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, దొడ్ల డెయిరీ సీఈవో బుసిరెడ్డి వెంకట్‌రెడ్డిలు కళాశాల ప్రత్యేక సావనీర్ ఆవిష్కరించారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతికతను వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. కామారెడ్డి డెయిరీ కళాశాల పూర్వ విద్యార్థి, దొడ్ల సీఈవో బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి తన డెయిరీ ద్వారా సామాజిక బాధ్యతగా రూ.4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కళాశాలలో పూర్తి సౌకర్యాలు ఏర్పాడిన పిదప డెయిరీ పీజీ కోర్సులు ప్రారంభిస్తామని వైస్ చాన్స్‌లర్ జ్ఞానప్రకాష్ వెల్లడించారు. దొడ్ల డెయిరీలో దాదాపు 30 మంది కామారెడ్డి డెయిరీ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించినట్లు వెంకట్‌రెడ్డి అన్నారు. రిజిస్ట్రార్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు డెయిరీ కంపెనీలు విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తు ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతు.. డెయిరీ రంగంలో నెలకు రూ.800లతో జీవితాన్ని ప్రారంభించి ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నానన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేఎస్ ఉమాపతి, స్వర్ణలత, పీడీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

ఇంకుడు గుంతలో పడి బాలుడి మృతి



రిత్విక్ (ఫైల్)

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు ఇంకుడు గుంతలో పడి మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన కొత్త కుమ్మరి రాణి కొన్ని రోజులుగా కొండాపూర్‌లోని తన తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈక్రమంలో రాణి కొడుకు రిత్విక్(3) ఇంటి ముందర చిన్న సైకిల్‌పై ఆడుకుంటుండగా, ఇంటి పక్కన గల కోటగిరి నారాయణగౌడ్ ఇంటి వద్ద ఉన్న ఇంకుడు గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. చాలా సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి బాలుడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం సిరికొండకు అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాటిపల్లి అడవుల్లో పెద్దపులి సంచారం



పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు


సిరికొండ: నిజామాబాద్ సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని తాటిపల్లి, జినిగ్యాల బీట్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. తాటిపల్లి శివారులోని మల్లం చెరువు, తాంట్ల కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లినవారికి పాద ముద్రలు కనిపించాయి. అనుమానం వచ్చి సమాచారం ఇచ్చారని రేంజర్ రవీందర్ తెలిపారు. ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీశంకర్, రేంజ్ ఆఫీసర్ రవీందర్, యానిమల్ ట్రాకర్స్, ఎన్‌జీవో వెంకట్, రేంజ్ సిబ్బంది శుక్రవారం ఆయా ప్రాంతాల్లో సంచరించారు. పాదముద్రలను పరిశీలించి మగ పెద్దపులిగా నిర్ధారించారు. గతంలో ఏటీఆర్ ఖానాపూర్ ఏరియా అటవీ ప్రాంతంలో సంచరించిన ఎస్12 పెద్దపులి అని గుర్తించారు. ఐదారు నెలల నుంచి జగిత్యాల జిల్లా కొడిమ్యాల రేంజ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రేంజ్ పరిధిలో తిరిగి ఇటువైపు వచ్చినట్లు రేంజర్ తెలిపారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న తండాలకు చెందిన గిరిజనులు, మేకల, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతులు పొలాల వద్ద కరెంటు తీగలను ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. అటవీ అధికారులు, యానిమల్ ట్రాకర్స్ ప్రతిరోజు గస్తీ తిరుగుతూ పులి కదలికలను పసిగడతామని, సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు రేంజర్ వివరించారు.

శ్రీ సిద్ధరామేశ్వరాలయంలో విచారణ



భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో పలు అంశాలపై దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం విచారణ నిర్వహించారు. విచారణ అధికారిగా నీలకంఠేశ్వరాలయం గ్రేడ్ –1 ఈవో గా పనిచేస్తున్న శ్రీరాం రవీందర్‌ను దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు నియమించారు. దీంతో ఆయన శుక్రవారం ఆలయానికి వచ్చి విచారణ నిర్వహించారు. ఆలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించిన సత్యనారాయణపై, ఎలక్ట్రిషియన్ గా విధులు నిర్వహించిన బల్యాల లక్ష్మీనారాయణపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిపారు.ఈనివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని పేర్కొన్నారు. ఈ విచారణలో ఈవో శ్రీధర్‌తో స్థానికులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన విద్యాశాఖ ఏడీ



కామారెడ్డి టౌన్: జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డి. శ్రీనివాస్ శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో విధుల్లో చేరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఆయన్ని నూతనంగా నియమించింది. మొదటి రోజు దేవునిపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ని డీఈవో రాజు, ఉపాధ్యాయులు సన్మానించారు.

డీఈవోగా బాధ్యతలు అప్పగించే అవకాశం!

ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎస్. రాజు విధులు నిర్వహిస్తున్నారు. అయితే నూతనంగా రెగ్యూలర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధుల్లో చేరిన డి. శ్రీనివాస్‌ను జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ త్వరలో రాష్ట్ర విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

నేడు సంస్కార భారతి గురు పూజోత్సవం

కామారెడ్డి అర్బన్: సంస్కార భారతి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు నటరాజ పూజ, గురు పూజోత్సవం నిర్వహించనున్నట్టు సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి పాతూరి సత్యప్రసాద్ తెలిపారు.స్థానిక తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సత్యప్రసాద్ కోరారు.